సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 8 । జూన్ । 2024



## వేసవి దుక్కులతో..

వేసవి దుక్కులతో భూసారం పెరుగుతుంది. రైతులకు మేలు జరుగుతుంది.

- 8లో



## పడవ బోల్తా.. వ్యక్తి మృతి

డి.మత్స్యలేశంలో ఓ వ్యక్తి పడవ బోల్తా పడి మృతి చెందారు. తోటివారు రక్షించేలోపే ఆయన చనిపోయారు.

- 8లో

## ఆప్షన్ల ఎంపిక ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ ప్రవేశాల పాలిసెట్-2024 కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం నుంచి కళాశాలలు, బ్రాంచ్‌ల ఆప్షన్ల ఎంపిక ప్రారంభమైంది. ఈ నెల 10వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపిక నిర్వహిస్తారు. జిల్లాలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించగా, 2307 మంది హాజరయ్యారు. ఆప్షన్ల ఎంపిక కొనసాగుతుండగా, హాజరు కాని పాలిసెట్ ర్యాంకర్లు 10వ తేదీలోపు హాజరు కావచ్చు. 11వ తేదీన ఆప్షన్ల మార్పు, 13వ తేదీన సీట్ల అలాట్‌మెంట్, 14వ తేదీ నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభం కానున్నాయి.

## న్యూస్‌రీల్

### డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ కళాశాల శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డీఆర్ జె.వెంకట లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు కళాశాల వద్దకు వచ్చి దరఖాస్తులు పొందవచ్చునని అన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని అని సూచించారు. పూర్తి వివరాల కోసం 08945293642, 8639539082, 9490638480, 9490809289 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### శివసాగర్ తీరంలో సినిమా చిత్రీకరణ



సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న చిత్ర యూనిట్

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరంలో శుక్రవారం తెలుగు, ఒరియా భాషల్లో తెరకెక్కుతున్న మిరాజ్ చిత్రంలోని పలు సన్నివేశాలను చిత్రీకరించారు. కేఎంసీ ఫిలిం మేకర్స్ బ్యానర్‌పై విష్ణుదేవ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో చరణ్, దీపిక హీరో హీరోయిన్లుగా ప్రధాన విలన్‌గా డాక్టర్ కుమార్ నాయక్, రమేష్ యాదవ్ నటిస్తున్నారు. ఈ మేరకు ఉద్దాన ప్రాంతంలో నిక్షిప్తంగా దాగి ఉన్న అందమైన ప్రకృతి రమణీయతను ప్రపంచానికి తెలియజేసే ఇతివృత్తంగా పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సినిమా షూటింగ్ చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

### కళింగ కార్పొరేషన్ చైర్మన్ పదవికి దుంపల రాజీనామా



దుంపల రామారావు (లక్ష్మణరావు)


శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కళింగ కార్పొరేషన్ చైర్మన్ పదవికి దుంపల రామారావు (లక్ష్మణరావు) రాజీనామా చేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎంగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళింగ కులాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పదవిని ఇచ్చినప్పటికి పూర్తిస్థాయిలో సేవలు అందించేలోపే దురదృష్టవశాత్తు పార్టీ అధికారం కోల్పోవడం బాధాకరమన్నారు. పదవి లేకున్నా కళింగులకు తన వంతు ఎల్లప్పుడూ సేవలు అందిస్తూనే ఉంటానని తెలిపారు. వెనుకబడిన కులాల్ని గుర్తించి వారి అభ్యున్నతికి కృషి చేసేందుకు కులాల కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసింది వైఎస్సార్‌సీపీయేనన్నారు. తన రాజీనామా పత్రాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ విజయవాడకు పంపించానన్నారు. ఇప్పటి వరకు తనకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేసిన సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డికి, వైఎస్సార్‌సీపీ జిల్లా ముఖ్య నాయకులకు, అభిమానులు, కార్యకర్తలకు, ప్రజలకు, రుణపడి ఉంటానన్నారు.

### ప్రపంచ స్థాయిలో మత్స్యకార యువకుడి ప్రతిభ



మైలపల్లి వెంకటరమణకు సన్మానం చేస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల చైనాలో ప్రపంచ స్థాయిలో పారా వాలీబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలం, చిన్న కొవ్వాడ మత్స్యలేశం గ్రామానికి చెందిన మైలపల్లి వెంకటరమణకి మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం పట్టణంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశా రు. కార్యక్రమంలో చింతపల్లి సూర్యనారాయణ, న్యాయవాది, గౌరవ అధ్యక్షులు, చీకటి శ్రీరా ములు, కన్వీనర్, గుంటు శ్రీనివాస రావు, అధ్యక్షు లు, మైలపల్లి నర్సింహమూర్తి, సంఘం ఉపాధ్యక్షులు మైలపల్లి పోలీసు, న్యాయవాది, కో కన్వీనర్, ఇద్ది పాపయ్య మాస్టారు, న్యాయవాదులు గుండాల గణేష్‌కుమార్, దుమ్ము అశోక్ తదితరులు పాల్గొన్నారు.




# 210 ఇయర్స్ ఇండస్ట్రీ

- 1.50 ఎకరాల్లో విస్తరించిన ఊడల మర్రి
- ఉద్దానం రామకృష్ణాపురంలో కడ, మొదలు గుర్తించలేని చెట్టు
- అక్కడే కొలువైన రామచండేశ్వరి అమ్మవారు

వజ్రపుకొత్తూరు

అనగనగా ఓ ఊడల మర్రి. రెండు శతాబ్దాలుగా ఆ చెట్టు విస్తరిస్తూనే ఉంది. ఇప్పటికే ఒకటిన్నర ఎకరా స్థలాన్ని తన సామ్రాజ్యంగా పాలిస్తోంది. ఇంత వరకు దాని మొదలు, చివర కనిపెట్టిన మనిషి లేడు. ఇదేమీ చిన్న పిల్లల కథ కాదు. వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం రామకృష్ణపురంలో ఈ చెట్టు నిజంగానే ఉంది. 1.50 ఎకరాల్లో విస్తరించిన ఈ మర్రి నీడన రామచండేశ్వరి అమ్మవారు కొలువై ఉన్నారు. అందుకే ప్రతి ఐదేళ్లకోమారు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ మర్రి ఊడలు శాఖోపశాఖలుగా వ్యాపించడంతో కడేదో.. మొదలేదో తెలియదు.

ఇప్పుడు ఉన్న గ్రామం ఇది వరకు ఇలా ఉండేది కాదు. అప్పట్లో సముద్ర తీరానికి 250 మీటర్లు తూర్పుగా ఉండేది. ఇసుక దిబ్బలు ఎత్తుగా వచ్చి పడడంతో 115 ఏళ్ల కిందట ఊరి వారంతా తీరానికి దూరంగా పల్లెను నిర్మించుకుని సమీపంలో ఉన్న రామచండేశ్వరి అమ్మవారికి పూజలు చేసేవారు. అప్పటికే మర్రి చెట్టుకు 100 ఏళ్లు అని నాటి తన తాతముత్తాతలు చెప్పేవారని గ్రామ మాజీ సర్పంచ్ చింత జనార్దనరావు చెప్పారు. అప్పట్లో మర్రి చెట్టుకు మహిమలు ఉండేవని, ఎవరైనా త్రినాథ మేళా పూజ కోసం మర్రి కొమ్మలు కోస్తే పాలకు బదులు ఎర్రని ద్రవం కారేదని చెబుతుంటారు. దీంతో అప్పటి నుంచి కొమ్మలు ఎవరూ కోయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

**చక్కటి పిక్నిక్ స్పాట్**

కార్తీక మాసంలోనే కాక వేసవిలో కూడా మర్రి చెట్టు వద్ద హాయిగా సేద తీరుతుంటారు. జారుడు బల్లలు, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయడంతో ఇక్కడ వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంటుంది. ఇదికాక కార్తీక మాసంలో వన భోజనాలు నిర్వహించేందుకు అనువుగా ఉండడంతో ఇక్కడ సందడి నెలకొంది. దీంతో పరిసర గ్రామ పాఠశాలల విద్యార్థులు, ఇతర ప్రాంతాల పర్యాటకులు వచ్చి విడిది చేస్తారు. అందులో పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎక్కువగా ఉంటారని సర్పంచ్ చింత హేమారావు, పద్మావతి వివరించారు. దీంతో మర్రి చెట్టు నీడలో కాసేపు సేద తీరేందుకు బల్లలు సైతం ఏర్పాటు చేశారు. గతంలో చెట్టు వద్దకు పోవాలంటే భయం ఉండేది. కానీ నేడు దాదాపు 700 మీటర్ల మేర సీసీ రహదారి సైతం వేయడంతో అందరూ చెట్టు చెంతన చేరుతున్నారు. అయితే ఈ మర్రి చెట్టు ఉండే స్థలం చాలా పవిత్రమైనదని సర్పంచ్ చెప్పారు. పవిత్రతను కాపాడేందుకు కార్తీక మాసంలో నిత్యం అక్కడ గ్రామ యువకులతో నిఘా ఉంచుతామని చెప్పారు.



మర్రి వృక్షం నీడన కొలువైన రామచండేశ్వరి అమ్మవారు

### ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



మర్రి చెట్టుకు 200 ఏళ్ల పైబడి ఘన చరిత్ర ఉంది. పవిత్రమైన స్థలం కావడంతో పూజలు సైతం నిర్వహిస్తాం. సముద్ర తీరానికి దగ్గరగా ఉండడం ఆహ్లాదంగా కనిపించడంతో కార్తీక మాసంలో ఎక్కువ మంది సందర్శకులు వస్తారు. కాబట్టి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే మంచిది.

– చింత పద్మావతి, సర్పంచ్, ఉద్దానం రామకృష్ణాపురం

### మొదలు ఎక్కడుందో తెలీదు



మర్రి చెట్టు మొదలు కనుగొనేందుకు ఎంతో మంది ప్రయత్నించినా ఫలితం లేదు. నేటి వరకు ఎవరూ కనుక్కోలేకపోయాం. మేమైతే అమ్మవారు ఉన్న ప్రాంతమే మొదలుగా నమ్ముతాం. రామచండేశ్వరి అమ్మవారు చాలా మహిమాన్వితురాలు. గ్రామంలో ఏ శుభ కార్యం జరిగినా అమ్మవారికి ముందుగా పూజలు చేయాల్సిందే. కార్తీక మాసం ఇక్కడ సందడిగా ఉంటుంది. వన భోజనాలు చేస్తారు. ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చి ఫొటోలు దిగుతారు.

– దున్న కృష్ణారావు, యువకుడు, ఉద్దానం రామక్రిష్ణాపురం

## గొట్టా బ్యారేజ్ పరిశీలన



వంశధార గొట్టా బ్యారేజీని పరిశీలిస్తున్న ఎస్‌ఈ తిరుమలరావు

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజీని వంశధార ఎస్‌ఈ డోల తిరుమలరావు శుక్రవారం పరిశీలించారు. ముఖ్యంగా గొట్టా బ్యారేజీకి సంబంధించిన గేట్లను పరిశీలించారు. వర్షాకాలంలో రానున్న వరదలకు ముందుగా గేట్లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా తెలుసుకునేందుకు ఎస్‌ఈ బ్యారేజీని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ఇటీవల జరిగిన జల వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్‌లో బ్యారేజీలకు సంబంధించిన గేట్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో గేట్లు పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతానికి బ్యారేజీకి సంబంధించి 22 గేట్లతోపాటు రెండు స్పిల్‌వే గేట్లు, ఎడమ, కుడి ప్రధాన కాలువల గేట్లు సక్రమంగా పనిచేస్తున్నాయని తెలిపారు. గొట్టా బ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ ద్వారా సుమారు లక్షా 48వేల ఎకరాలకు, కుడి ప్రధాన కాలువ ద్వారా 80వేల ఎకరాలకు సాగునీరు అందించినట్లు తెలిపారు. మెయింటెనెన్స్ నిధులు లేక మరమ్మతులు చేయలేకపోయామన్నారు. ఎడమ ప్రధాన కాలువ అభివృద్ధికి రూ.7.50కోట్లు, కుడి ప్రధాన కాలువకు రూ.5కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో గుర్రపు డెక్క నిండి ఉండటంతో వాటిని తొలగించేందుకు కలెక్టర్ ఏటా రూ.50 లక్షలు మంజూరు చేసేవారని, ఈ ఏడాది కూడా ఆ మేరకు ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. కాలువల ద్వారా శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిచేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా ఎడమ కాలువ ఏర్పడి 50 ఏళ్లు దాటింది. దీంతో ఈ కాలువ 20శాతం మేర స్కిల్ట్‌తో పేరుకుపోయిందని, కాలువపై ఉన్న స్లైచ్చర్లు పాడయ్యాయన్నారు. కాలువ ఆధునికీకరణకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. వంశధార రిజర్వాయర్ పనులు 98 శాతం పూర్తయ్యాయని తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. అవి పూర్తయితే రిజర్వాయర్‌లోకి నీటిని నింపి రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించవచ్చునన్నారు. ఆయన వెంట వంశధార ఈఈ ప్రదీప్ డీఈలు, ఏఈలు సిబ్బంది ఉన్నారు.

## 'క్రమశిక్షణతో చదవాలి'



మాట్లాడుతున్న రిమ్స్ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ బగాది శ్రావ్య

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో విద్యను అభ్యసించడం ద్వారా మంచి ఫలితం ఉంటుందని రిమ్స్ హాస్పటల్ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ బగాది శ్రావ్య అన్నారు. జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆంధ్రప్రదేశ్, శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని పెద్దరెల్లివీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో వేసవి వినోదం పేరిట నిర్వహించిన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావ్య మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా, చురుగ్గా ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పిల్లలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఆరోగ్యంగా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం పిల్లలకు నీతి కథలు, కవితలు, పురాణాల గురించి పలువురు వక్తలు వివరించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా కోశాధికారి వీఎస్ కుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఇ.పార్వతీశం, విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి కొత్తకోట అప్పారావు, ఎం.ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీపై హత్యాయత్నం

- ఇంటికి వెళ్లి మరీ దాడి చేసిన టీడీపీ నాయకులు
- అడ్డుకున్న భార్య దుస్తులు చింపేసి దురాగతం

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం ఎంపీటీసీ గందు మోహనరావుపై శుక్రవారం రాత్రి కిష్టుపురం గ్రామంలో హత్యాయత్నం జరిగింది. టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని, ఎన్నికల ఫలితాల అనంతరం వారు హెచ్చరించారని, శుక్రవారం దాడికి తెగబడ్డారని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫలితాలు వచ్చాక కిష్టుపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరకూడదంటూ సిమ్మెంట్ దిమ్మను తోసేశారు. ఎంపీటీసీ ఇంటిపైకి బాంబులు కూడా విసిరారు. అప్పటి నుంచి మోహనరావు ఇంటికే పరిమితమైపోయారు. శుక్రవారం పొలం వైపు వెళ్దామని బయటకు రాగా అక్కడకు వచ్చిన టీడీపీ కార్యకర్తలు ఇనుప రాడ్డుతో ఆయన తలపై కొట్టారు. అడ్డుకున్న మేనల్లుడు సురేష్‌ను కూడా గాయపరిచారు. మోహనరావు భార్య రేణుక జాకెట్ చింపేయడంతో ఆమె ప్రాణభయంతో కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ పారినాయుడు తక్షణమే మోహనరావును ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం దాడి జరిగిన తీరుపై వివరాలు నమోదు చేసుకుని చేసుకున్నారు.

అనంతరం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పలాస ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రజలు గెలిపించింది ఇందుకేనా అని ప్రశ్నించారు. దాడులు ఆపకుంటే ఈ క్షణం నుంచే రోడ్డు పైకి వస్తామని, ఓడిపోయి ఉండవచ్చు కానీ తాము బలహీనులం కాదని అన్నారు. బుధ, గురువారం ఇద్దరు వైశ్య కుటుంబాల ఇంటికి వెళ్లి బెదిరించారని, మందస మండలంలో అభిరాం అనే బూత్ ఏజెంట్‌ను భయపెట్టి వెంటాడారని ఆయన పోలీసులను ఆశ్రయించాడని, ఇప్పుడు మరో దాడి జరగడం ఘోరమన్నారు. 2014 నుంచి 2019 వరకు ఇలానే చేశారని గుర్తు చేశారు. హత్యానేరం కింద చర్యలు చేపట్టాలని లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో రోడ్డెక్కుతామని అన్నారు. జిల్లా ఎస్పీ, డీఎస్పీ సీరియస్‌గా తీసుకోవాలని కోరారు.



తలకు తగిలిన గాయంతో ఎంపీటీసీ గండు మోహనరావు



మోహనరావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



భయంతో రోదిస్తున్న మోహనరావు భార్య

**శ్రీకాకుళంలో..**

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరివానిపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శిమ్మ అప్పన్న, బగ్గు రామారావులపై టీడీపీ కార్యకర్తలు శుక్రవారం రాత్రి కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గ్రామంలో స్వల్ప వివాదాలు చోటు చేసుకున్నాయి. ఇదే అదనుగా భావించిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేశారు. దీంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులను రిమ్స్‌కు తరలించారు.



గాయపడిన కార్యకర్త

## కిడ్నీ ఆస్పత్రిపై దాడులు సరికాదు

- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంపై కొందరు టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడడం సరికాదని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందిన నారా చంద్రబాబు నాయుడుకు, గౌతు శిరీషకు అభినందనలు తెలిపారు. పలాసలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కోసం నిర్మించిన వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రంపై కొంతమంది తెలుగుదేశం నేతలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, వైఎస్ఆర్ అనే పేరును తొలగించడం, శిలాఫలకాలను ధ్వంసం చేయడం బాధాకరమని అన్నారు. ఆస్పత్రి నిర్మించడం తప్పా, కిడ్నీ బాధితులకు వైద్యం అందించడం తాము చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఇలాంటి దాడులతో సమాజానికి ఏం సందేశం ఇవ్వనున్నారని ప్రశ్నించారు. కిడ్నీ ఆస్పత్రిపై దాడి చేయడం అంటే ప్రభుత్వంపై దాడి చేయడమేనని, ఇది ఏ ఒక్కరి సొత్తు కాదని రోగులు అన్ని పార్టీల్లోనూ ఉన్నారని, అలాంటి వారిపై దాడులు మానుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్దాన ప్రాంతీయులు కిడ్నీ బాధితులుగా ఎందుకు పుట్టామని బాధపడుతుంటే వారి పరిస్థితి తెలుసుకుని వైఎస్ జగన్ ఆస్పత్రి కడితే ఇలా పాడు చేయడం బాధాకరంగా ఉందన్నారు.

టీడీపీ నేతలకు, కార్యకర్తలకు ఏదైనా కోపంగా ఉంటే తనపై చూపిస్తే తాను భరిస్తానని అన్నారు. వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలను ఫోన్లలో బెదిరిస్తున్నారని అన్నారు. పార్టీ నేతలు ఏ మాత్రం అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. తనకు 60 వేల మంది ఓటు వేశారని, కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ప్రభుత్వ పరంగా, సొంతంగా సాయం చేసి 24గంటలు అందుబాటులో ఉన్నానని చెప్పారు. మంత్రి అయ్యాక కూడా సమయం చూసుకుని నియోజక వర్గంలో ప్రతి గడప తొక్కానని అన్నారు. అయినా ఎన్నికల ఫలితాలు షాక్‌కు గురి చేశాయని చెప్పారు. తనపైన అసత్య ప్రచారం చేసి ప్రతిష్టను తగ్గించారని, ఇప్పటికీ తప్పుడు పోస్టులు పెడుతున్నారని అన్నారు.



శిలాఫలకంపై పేర్లు తీసేసిన దృశ్యం

## వైఎస్ జగన్‌ను కలిసిన దువ్వాడ

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లి కార్యాలయంలో కలిసి టెక్కలి నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితులను వివరించారు.

–టెక్కలి





## డొక్కలే జీపీఎస్‌లు..

మూగ జీవాల మెడలో వేలాడే డొక్కలే వాటి జీపీఎస్‌లు. ఇప్పటికే పల్లెల్లో ఈ పద్ధతి కనిపిస్తోంది. మూగ జీవాలను పెంచేవారు వాటి మెడలో ఇలాంటి డొక్కలను వేలాడదీస్తారు. మందలకు తీసుకెళ్లేటప్పుడు, బయటకు వెళ్లేటప్పుడు ఈ మూగజీవాలు తప్పిపోతే ఈ డొక్కల శబ్దం ఆధారంగానే కాపరులు వెతుకుతారు.

– కాశీబుగ్గ







## క్లుప్తంగా

### సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ

టెక్కలి రూరల్: స్థానిక తెంబూర్ రోడ్డులో గురువారం ఒక సెల్ ఫోన్ చోరీ జరిగినట్లు శుక్రవారం బాధితుడు టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు సింగుపురం తవిటయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. రాధా వల్లభపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తవిటయ్య గురువారం తెంబూర్ రోడ్డులో ఉన్న ఆటో స్టాండ్ వద్ద ఫోన్ మాట్లాడుకుంటూ ఆటో నంబర్ నమోదు చేస్తుండగా ఒక వ్యక్తి బైక్‌పై వచ్చి బైక్ అదుపు తప్పినట్లు నటించి కిందకు పడిపోబోయాడు. వెంటనే తవిటయ్య తన సెల్ పక్కన పెట్టి ఆ వ్యక్తిని పైకి లేపేందుకు ప్రయత్నిస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో వ్యక్తి ఆ సెల్ ఫోన్ తీసుకుని అదే బైక్‌పై కూర్చుని వెళ్లిపోయాడు. వారు వెళ్లిపోయాక గానీ తవిటయ్యకు సెల్‌ఫోన్ పోయిన సంగతి తెలియలేదు. దీంతో ఆఖరుకు పోలీసులను ఆశ్రయించాడు.

### పాములు పట్టే వ్యక్తిని కాటేసిన పాము

టెక్కలి రూరల్: పాములు పట్టుకుని వాటిని ఆడించుకుని వాటి ద్వారా వచ్చే సంపాదనతో కుటుంబాన్ని పోషించుకునే వ్యక్తి పాము కాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన గంట నర్సింహులు అనే వ్యక్తి శుక్రవారం ఒక ఇంట్లో పాము దూరిందని ఫోన్ రావడంతో ఆ ఇంటికి వెళ్లి పామును పట్టుకుని ఇంటికి వచ్చాడు. దాని కోరలు పీకే ప్రయత్నంలో ఆ పాము కాటు వెయ్యడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే పాముకాటుకు గురైన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

### మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట: రుతుపవనాలు రాకతో వర్షాలు పడే అవకాశం ఉందని, ఇళ్ల పరిసరాల్లో నీరు చేరి దోమలు పెరగవచ్చని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఈఓ గణపతిరావు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా మండలంలోని గోకయ్యవలసలో శుక్రవారం ఉపాధి వేతనదారులకు మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ పదార్థాలు తినొద్దని, కాచి చల్లార్చిన నీరు తీసుకోవాలని కోరారు. జ్వరం వచ్చినట్లు అనుమానం వస్తే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి లేదా వెల్‌నెస్ కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌వీ కె.అనురాధ, సూపర్‌వైజర్ జి.వెంకటరమణతో పాటు ఉర్లాం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

### నూతన సీఎస్‌ను కలిసిన ఎన్‌జీఓ సంఘ నేతలు


ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కలసిన ఏపీ ఎన్‌జీఓ సంఘ నేతలు

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు తదితరులు ఆంధ్రప్రదేశ్ నూతన చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏపీ ఎన్‌జీఓ సంఘ కార్యవర్గ సభ్యులు, సంఘ ప్రతినిధులు ఉన్నారు.

### ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని భామిని, మెళియాపుట్టిలలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ, భామిని ఈఎంఆర్ఎస్‌లో హెచ్‌ఈసీ గ్రూప్‌లో బాలురుకు 8, బాలికలకు 4 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. మెళియాపుట్టి ఈఎంఆర్ఎస్‌లో హెచ్‌ఈసీ గ్రూప్‌లో బాలురుకు 13 సీట్లు, బైపీసీలో 3 సీట్లు, బాలికలకు 8 సీట్లు ఖాళీగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆయా ఖాళీల భర్తీకి కూడా త్వరలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, కన్వీనర్ ప్రిన్సిపాల్ కె.సురేష్, రాధాకృష్ణ, సీఎంఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌ఐకు వీఆర్..?

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్‌కు వీఆర్‌కు (అటాచ్డ్ స్పెషల్‌బ్రాంచి) పంపినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. శుక్రవారం విధుల్లోకి వచ్చిన ఆయన ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఎస్ఐ గణేష్ స్టేషన్ నుంచి ఇంకా రిలీవ్ కాలేదు.

# వేసవి దుక్కులతో భూమికి సారం


హిరమండలంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

- తెగుళ్ల నివారణకు దుక్కులే మేలైన మార్గం
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు

హిరమండలం: పంట పండించే ముందు భూసారం పెంచుకోవడం తెలివైన పని. వరస పెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమైపోతాయి. అందుకనే మన పూర్వీకులు ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు పండించిన భూముల్లో వేసవి దుక్కులు చేపట్టి భూసారాన్ని కాపాడేవారు. ఆధునిక కాలంలో పంటలు పండించడంపై చూపిస్తున్న మక్కువ భూసారం పెంచడంపై చూపించడం లేదు. రబీ తర్వాత వేసవిలో ఆయా భూముల్లో దుక్కులు చేపట్టడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

**పూర్వీకుల పద్ధతి**

మన పూర్వీకులు ఏ పనిచేసినా అప్పటి ప్రయోజనాలతో పాటు భవిష్యత్ గురించి ఆలోచించేవారు. ముఖ్యంగా వ్యవసాయంలో భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన పంటలు పండించే దిశగా అడుగులు వేసేవారు. ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తమయ్యే పొలాల్లో వేసవి సమయంలో దుక్కులు చేపట్టి భూసార పరిరక్షణకు చర్యలు తీసుకునేవారు. కాలక్రమంలో అన్నదాతలు ఆధునికత పేరుతో బిజీ అయిపోయి వేసవి దుక్కులు చేపట్టడం చాలావరకు మానేశారు.

**మంచి దిగుబడులు**

మెట్ట ప్రాంతంలో ముఖ్యంగా వరి సాగులో ముందుండే శ్రీకాకుళం జిల్లాలోని రైతులు చాలామంది వర్షాలు కురిసిన వెంటనే వేసవి దుక్కులు చేస్తుంటారు. అయితే ఎండల తీవ్రతతో భూములు కూడా భగభగమంటూ కాగిపోతున్న తరుణంలో దుక్కులు చేయడం ఎలా అని చాలా మంది రైతులకు సందేహం రావచ్చు. బోర్లు, సాగునీటి సదుపాయాలు ఉన్నవారు ఇప్పటికే వేసవి దుక్కులు ప్రారంభించారు. మిగిలిన వారు నైరుతి రుతుపవనాలు ఈసారి నిర్ణీత సమయంలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో కాస్తోకూస్తో వర్షాలు పడిన వెంటనే చేపట్టవచ్చు. వేసవి దుక్కులు చేపట్టి పశువుల పెంట వేయడం ద్వారా ఆయా భూముల్లో భూసారం వృద్ధి చెంది, సాగు చేసే పంటలు మంచి దిగుబడిని ఇస్తాయి.

**ప్రయోజనాలు..**

- వేసవిలో పొలాలను దుక్కు చేయడం వల్ల ఆయా పొలాల్లో పెరిగిన గడ్డి నశించిపోవడంతో పాటు వరిమోనలు కుళ్లి భూమిలో కలిసిపోయి ఎరువుగా మారుతాయి.
- భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి రావడం వల్ల వాటిని పక్షులు ఆహారంగా తీసుకుంటాయి. తదుపరి వేసే పంటలకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి.
- పక్షులు ఆహారంగా తీసుకోగా మిగిలిన పురుగులు వేసవి ఎండల తీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆ పొలంలో పురుగుల ఉద్ధృతి తగ్గుతుంది.
- తెగుళ్లకు కారణమయ్యే శిలీంద్రాలు కూడా ఈ ఎండలకు చనిపోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సాగు చేసే పంటలకు తెగుళ్ల బెడద లేకుండా నివారించవచ్చు.
- రైతు ఇదే సమయంలో దుక్కు చేసిన పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూమి సారాన్ని కూడా పెంపొందించుకునే అవకాశం ఉంటుంది.

**వేసవి దుక్కులు చేయడం మంచిది**


నూరగా నూరగా రాళ్లు కూడా పిండి అయిపోతుంటాయి. మన పొలాల్లో విరామం లేకుండా పంటలు పండిస్తూ పోతుంటే వాటిలో సారం కరిగిపోతుంది. ఈ సమస్యను నివారించేందుకు పొలాల్లో వేసవి దుక్కులు చేపట్టడం ఎంతో అవసరం. రబీ పంట తర్వాత పొలాల్లో వేసవి దుక్కులు చేయడం వల్ల చీడ పురుగులు, శిలీంద్రాలు చనిపోతాయి. గడ్డి, గరప కుళ్లి నేల సారవంతంగా తయారవుతుంది. వేసవి దుక్కుల చేసిన పొలాల్లో తెగుళ్ల బెడద చాలావరకు ఉండదు. తద్వారా దిగుబడులు బాగుంటాయి.

– బి.సంధ్య, వ్యవసాయాధికారి, హిరమండలం

**పూర్వీకుల ముందు చూపు**


పూర్వీకులు ఏ పని చేసినా ముందు చూపుతో చేసేవారు. అందులో వ్యవసాయంలో వారు అనుసరించే అనేక పద్ధతులు నేటికీ ఆచరణ యోగ్యంగా ఉన్నాయి. అలాంటి వాటిలో మనం పంటలు పండించే పొలంలో వేసవి దుక్కులు చేపట్టడం ఒకటి. దీని వల్ల ఆ భూమిలో ఉండే చెత్తా చెదారం కలుపులు అన్నీ భూమిలో కలిసి ఆపై కురిసే వర్షపు చినుకులకు అవి కుళ్లి భూసారం పెరుగుదలకు తోడ్పడతాయి. అదే సమయంలో మనం కూడా పశువు పెంటను చల్లితే మరింత సారవంతమవుతాయి.

– లుకలాపు శ్రీనివాసరావు, రైతు కిట్టలపాడు

## గోపాలపెంట ఇసుక ర్యాంపు పరిశీలన


గోపాలపెంట ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగయ్య, తదితరులు

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట ఇసుక ర్యాంపును శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య శుక్రవారం పరిశీలించారు. మైన్స్, సర్వేయర్ సిబ్బందితో కలసి ర్యాంపును పరిశీలించారు. ఈ ర్యాంపులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట నరసన్నపేట తహసీల్దార్ కనకారావు, వీఆర్వో అప్పలనాయుడుతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

## వడదెబ్బకు ఉపాధి వేతనదారు మృతి


సంఘటనా స్థలం వద్ద ఎర్రయ్య మృతదేహం

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటకు చెందిన ఉపాధి వేతనదారు ఎర్రయ్య(59) వడదెబ్బకు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రయ్య శుక్రవారం ఉదయం స్థానిక దుమ్మువారి అమ్మోరు చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల కోసం వెళ్లారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వేతనదారులంతా ఉదయం 10 గంటలకు పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్నారు. ఎర్రయ్య మాత్రం చెరువు వద్దే ఉండిపోయారు. ఆయనను ఎవరూ గమనించలేదు. మళ్లీ తిరిగి సాయంత్రం చెరువు వద్దకు వేతనదారులంతా వెళ్లినప్పుడు గట్టుపై ఎర్రయ్య చలనం లేకుండా కనిపించారు. వారంతా దగ్గరకు వెళ్లి చూస్తే ప్రాణం లేదు. దీంతో కుటుంబ సభ్యులకు, ఉపాధి అధికారులకు సమాచారం అందజేశారు. మృతుని భార్య పోలమ్మ కరోనా సమయంలో వైరస్ సోకి మృతి చెందగా, కుమార్తె అరుణ మాత్రమే ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై రోదించారు. నిరుపేద కుటుంబం కనుక ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## ట్రాఫిక్ ఐలాన్‌ను ఢీకొట్టిన పార్సిల్ వ్యాన్


జీటీరోడ్డులో ఒరిగిన ట్రాఫిక్ ఐలాన్

శ్రీకాకుళం క్రైమ్ : గురువారం అర్ధరాత్రి దాటాక నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న ట్రాఫిక్ ఐలాన్ (బూత్)ను గుర్తు తెలియని పార్సిల్ వ్యాను ఢీకొట్టినట్లు సీఐ అవతారం పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసులు అందులో ఉండేందుకు ఏర్పాటు చేసిన ఈ ట్రాఫిక్ ఐలాన్‌ను వ్యాను ఢీకొట్టడంతో అది ఒరిగి అక్కడే ఉన్న రెండు ద్విచక్రవాహనాలపై పడింది. సమీప సీసీ ఫుటేజీలో ఢీకొట్టిన వ్యాను వివరాలేమైనా దొరుకుతాయన్న కోణంలో పరిశీలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### జాతీయ స్థాయి కవితల పోటీల్లో కుప్పిలికి ప్రథమ బహుమతి


కె.వి. రాజారావు, ఆమదాలవలస

ఆమదాలవలస: కెనడాకు చెందిన 'కవితా వేదిక' సంస్థ ఈ సంవత్సరం మార్చిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు రచించిన 'అనురాగం అస్తమిస్తున్న వేళ' అనే కవితకు ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు ఆ సంస్థ నిర్వాహకులు నవీన్ చంద్ర మెయిల్ ద్వారా శుక్రవారం సమాచారం పంపారని కవి తెలిపారు. ఈ నెలలో జరిగే జూమ్ సమావేశంలో రాజారావు కవితా పఠనం, పురస్కారం కూడా ఆన్‌లైన్‌లో అందజేస్తారని వారు తెలిపినట్లు కవి కేవీ రాజారావు తెలిపారు. కవితా పఠనం యూట్యూబ్ ద్వారా ప్రసారం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆమదాలవలసకు చెందిన పలువురు సాహితీ వేత్తలు అభినందనలు తెలిపారు.

### ఏకగ్రీవంగా ఏఎఫ్‌కేకే సంఘం కార్యవర్గం


అధ్యక్షుడిగా కామేశ్వరప్రసాద్


కార్యదర్శిగా దండా వెంకటరమణ

పొందూరు: ప్రపంచ ప్రఖ్యాత పొందూరు ఖాదీ రంగం అభివృద్ధికి పాటుపడుతున్న ఏఎఫ్‌కేకే సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన గుంటుకు కామేశ్వర ప్రసాద్, డి.వెంకటరమణలు మరోసారి ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకోవడంతో పాటు ఉపాధ్యక్షునిగా కొడమటి కొండలరావు, కోశాధికారిగా వెంకటసత్యనారాయణ, సభ్యులుగా ఎం.శ్రీనివాసరావు, డి.శ్యామసుందరరావు, నరేష్, బాలాజీ, రమేష్, తవిటమ్మ, ప్రమీల ఎన్నికయ్యారు.

## అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



భారీ ర్యాలీగా మృతదేహాన్ని టెక్కలిలోకి తీసుకువస్తున్న దృశ్యం, జవాన్ మృతదేహానికి నివాళులు

టెక్కలి రూరల్: మణిపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ మెట్ట తేజేశ్వరరావు మృతిచెందిన విషయం తెలిసిందే. జవాను మృతదేహాన్ని శుక్రవారం సీఆర్పీఎఫ్ అధికారులు ప్రత్యేక వాహనంలో టెక్కలి తీసుకువచ్చారు. టెక్కలి జగతిమెట్ట వద్దకు చేరుకునే సరికి భారీ ద్విచక్రవాహన ర్యాలీతో మృతదేహాన్ని స్వగృహానికి తీసుకువెళ్లారు.

అనంతరం అక్కడ అధికారులు మృతుని భార్యకు జాతీయ జెండా అందించారు. అనంతరం మృతదేహాన్ని చేరివీధి సమీపంలో ఉన్న శ్మశాన వాటికకు తీసుకువెళ్లి అక్కడ అధికార లాంఛనాలతో గాలిలో మూడు రౌండ్‌లు కాల్పులు జరిపి అంత్యక్రియలు నిర్వహించారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య


కరపత్రాన్ని విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ రబీన్‌కుమార్

ఇచ్ఛాపురం: ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాడి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతుందని, ఈ మేరకు సంబంధిత కరపత్రాలను శుక్రవారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ విడుదల చేశారు. కాలేజీల్లో ప్రవేశం కోసం ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులంతా బీకాం, బీఏ, బీఎస్సీ గ్రూప్‌లలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నృత్యకారులకు అరుదైన అవకాశం


జగన్నాథుని నృత్యోత్సవంలో పాల్గొనే అవకాశం దక్కించుకున్న నృత్యకారులతో అధ్యక్షులు చిన్నాగురుస్వామి

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీకి చెందిన నృత్యకారులకు ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పూరీ జగన్నాథుని సన్నిధిలో నిర్వహించే జగన్నాథుని నృత్యోత్సవంలో పాల్గొనే అరుదైన అవకాశం లభించినట్లు అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి తెలియజేశారు. ఈ మేరకు అవకాశం దక్కించుకొన్న, శృతిపట్నాయక్, దట్టి కావ్య, నీలాపు శైలజ, సిల్లా పూజశ్రీ, అశి శ్వేతారాణి, బి.దీక్షిత, ఎస్.రమ్యశ్రీ, బి.నిఖిత, డి.సిందు, యు.పల్లవి, పి.ప్రణవి, జైత్రికాధ్యాయని, మౌనిక, ఆర్.మధుశ్రీలకు అకాడమీ ఆవరణలో శుక్రవారం అభినందనలు తెలియజేశారు.

## వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు


గెలుపొందిన బహుమతులతో విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రచయిత కాశీపట్నం సుబ్బారావు విచ్చేసి మాట్లాడారు. గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మనో వికాసం వృద్ధి చెందుతుందన్నారు. ఖాళీ సమయంలో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి జ్ఞానం పెంచుకోవాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను తప్పకుండా వినియోగించుకుని సమాజంలో ఒక మంచి క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు మాట్లాడుతూ ఏటా ఈ విధంగా గానే విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనాలని, వేసవి సెలవుల్లోనే కాకుండా ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి కొంత సేపు పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో వేసవి శిక్షణ శిబిరం రిసోర్స్ పర్సన్లు కృష్ణారావు మాస్టర్, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కర రాజా, సిబ్బంది ప్రత్యూష, రామ్మోహన్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## హయాతీనగరం పాఠశాల విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని హయాతీ నగరంలోని ఎంజీపీఏపీబీసీడబ్ల్యూ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు.

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అటవీ శాఖ నిర్వహించిన వివిధ జిల్లాస్థాయి పోటీల్లో ఆ పాఠశాల విద్యార్థినులు రాణించి బహుమతులు అందుకున్నారు. వక్తృత్వ పోటీల్లో జి.లక్ష్మి ప్రథమ స్థానంలో నిలవగా, వ్యాసరచన పోటీల్లో ఎం.లహరి ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. విద్యార్థినుల రాణింపుపై ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. వీరిని తీర్చిదిద్దుతున్న టీచర్లను మెచ్చుకున్నారు.

## పడవ బోల్తా వ్యక్తి మృతి


మృతి చెందిన ఎర్రయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: డి.మత్స్యలేశం గ్రామంలో శుక్రవారం వేకువ జామున పడవ బోల్తా పడి మూగి ఎర్రయ్య (59) అనే వ్యక్తి మృతి చెందారు. ఎర్రయ్య, గుంటు కొండయ్య, మూగి రాజప్పడు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వేట పూర్తి చేసుకుని ఒడ్డుకు చేరుతుండగా, సముద్రంలో కెరటాల ఉద్ధృతికి పడవ బోల్తా పడింది. ప్రమాదంలో పడవలో ఉన్న వారంతా సముద్రంలో పడిపోయారు. అయితే పడవ మళ్లీ సరి చేశారు. ఎర్రయ్య మాత్రం అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పడవలో ఎక్కించి తోటి మత్స్యకారులు ఒడ్డుకు చేర్చారు. కానీ ఒడ్డుకు తీసుకు వచ్చే సరికే ప్రాణాలు విడిచాడు. భార్య కామమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎర్రయ్య మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మృతునికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.